

# ఎవరి 'షర్మా'కెవరు కర్తలు!

అవసరాల రామకృష్ణారావు

**నీతిబోధ అంతటి నికృష్టపు పని మరొకటి లేదని ఎప్పుడూ అనుకునే వాణ్ణి. ఎందుకంటే ఆ చెప్పే నీతి ముందే మనం ఆచరించి చెప్పాలని ఎక్కడా లేదు. ఇక మనం చెప్పింది విన్న శ్రోత దాన్ని తప్పక ఆచరించి తీరతాడని మనకెలాగా నమ్మకం ఉండదు. ఇక ఎందుకు చెప్పండి, కంఠశోష తప్ప? అయితే రాజకీయ నాయకుల్లో కూడా పెద్ద మనుషులున్నట్టు మన హితోపదేశం కూడా ఒక్కొక్కప్పుడు స్వప్రయోజనకారి కావొచ్చు.**

**అలా నాకు జరిగింది కాబట్టే, మీతో చెప్పడం.**

**ఇలాంటిదే ఇంకో విషయం కూడా దీనికి జోడించి చెబితే నా అనుభవం మీకు పూర్తిగా అర్ధమౌతుంది.**

**సానుభూతి అంటారు చూశారూ, అదంటే నాకు పరమ ఒళ్లుమంట. అయితే దాన్ని కూడా పూర్తిగా కొట్టి పారెయ్యనక్కర్లేదు. ఒకరి సానుభూతి మన స్వీయ రసానుభూతిగా కలసిరావొచ్చు!**

అలా అనుభవించాను గనకనే, మీకు వివరించడం.

ఇక హస్కు చాలించి అసలు కథలోకి దిగుతాను.

అప్పటి విదేశీ ప్యాకేజి టూరులో నమోదు చేయించుకున్న పది మంది హనీమూన్ జంటలతో పాటు విడిమనుషులం మేం ముగ్గురమే. నేనూ, రాజూ, శీనూ. పాతికేళ్ళకి కాస్త అటూ ఇటూగా వాళ్ళుంటే, రిటైరై రెండేళ్ళు దాటిన వయసునాది. తొలి చూపులోనే రాజుకి నా ఆకారం చూసి ఓ విధమైన హేళనా, శీనుకి పెద్దవాళ్ళంటే ఆరాధనా కనిపించాయి. ఏదో చెప్పేను కాని, ఎవరేమనుకుంటే నాకేం, నన్ను నేనుగా కాపాడుకోగల దక్షత నాకుంది. కాదు, ఈ మధ్యనే లభించింది! అవును. అర్థికస్వేచ్ఛ అసలైన స్వేచ్ఛ అని మా ఆవిడ పోయిన తర్వాతే కదా నాకు తెలిసింది! తక్కిన సుఖాలు ఎన్ని సమకూర్చుతేనేం పైసా ఖర్చుపెట్టకుండా తొక్కిపెట్టేది. పంజరం వీడి ఏడాదైై తనెక్కడికి ఎగిరిపోయిందో తెలీదుగాని, నాకు మాత్రం బంధవిముక్తి కలిగింది అప్పుడే! ఇంత మోటుగా చెబుతున్నందుకు నేనేం సిగ్గు పడడం లేదు. కూడ బెట్టి కుదవబెట్టింది అదేం కట్టుకుపోగలిగిందా? అన్నీ నాకే వదిలిపెట్టక తప్పలేదు కదా! అప్పుడే కదా అంత ఆస్తి మీద నాకు అధికారం దక్కింది! అది దక్కాకే కదా నేనెవరో నాకు తెలు

సుకొచ్చింది! ఇప్పుడింత ఖరీదు పెట్టి ఈ ఫారిన్ ట్రిప్ టికెట్ కొన్నానంటే ముందుగా అది 'విమానం ఎక్కేయడం' వల్లనే కదా!

ఆస్తి ఖర్చుపెట్టగలిగే అంతస్థు అందరికీ అందదు. అది తెలిశాక బంధువులందరూ బెల్లం చుట్టూ చీమల్లా చేరడం సహజమే. ఎవరో ఎందుకు, ఉన్న ఒక్క కూతురే దాని మీద కన్నేసింది. 'వచ్చి నా దగ్గరుండమని' ఓ వందసార్లైనా చెప్పి ఉంటుంది. నేను కొరకబడక పోతే అల్లుణ్ణి ఉసిగొల్పింది.

'అత్తగారు మిమ్మల్ని ఒంటర్నిచేసి వెళ్లిపోయారు. మీకింక ఎవరున్నారని! మిమ్మల్ని తలుచుకుని మీ అమ్మాయి కంటికీ మంటికీ ఏక ధారగా ఏడుస్తోందంటే నమ్మండి. దగ్గిరుండి తీసుకువెడదామని అన్ని ఏర్పాట్లూ చేసుకు వచ్చాను. ఇక కాదనకండి. ఈ వయసులో ఎలా బతుకుతారు!'

ఈ దొంగసానుభూతి కబుర్లు ఎవరెరగరని! ఓ జీవితకాలం నరకం అనుభవించాను. ఇక దీని ప్రతినిధి దగ్గిరా నా రోజులు వెళ్ళ దీసుకొనేది! ఇంతకీ నా వయసు ఏం ముదిరిపోయిందని! చెప్పాలంటే నాకు వయసొచ్చినట్టు అనిపిస్తున్నది ఇప్పుడిప్పుడే కదా!

ఇహ మొహమాటాలెందుకని పైకిలా కక్కేశాను. 'చూడమ్మా అల్లుడూ! ఎప్పుడో నేను నిశ్చయించేసుకున్నాను. అమ్మాయితో పదే పదే చెప్పేను కూడా. బ్రహ్మరుద్రాదులొచ్చినా నన్నిక్కణ్ణుంచి కదిలించలేరు. వచ్చి పిలిచేవు థాంక్సు. మళ్ళీ వచ్చి పిలవకపోతే మరింతగా థాంక్సు. ఇంకా నాకు ఇల్లుంది. సుఖపడాలనే థ్రిల్లుంది. ప్రతీనెలా ఇన్నిన్ని పచ్చనోట్లు జేబులో వచ్చిపడే పెన్షను సదుపాయం అనేది బతికున్నన్నాళ్ళు ఉంటుంది. నాగురించి ఎట్టి విచారమూ పెట్టుకో వద్దని అమ్మాయికి చెప్పు. ఇక నువ్వు బయల్దేరొచ్చు' అతను వెళిపోతూ 'ఎవరికర్మ కెవరు కర్తలు!' అని గొణుక్కోడం నాకు వినిపించకపోలేదు. ఇప్పటికైనా నాకర్మకు నేనే కర్తనయే వెసులుబాటు దొరికింది. దానిలో ఒకరి చెయ్యి పెట్టనిస్తానా!

ఈనాటికి ఈ ఫారిన్‌ట్రిప్‌లో జతపడిన ఈ కుర్ర కుంకలా నన్ను అంచనా వేసేది! ఒకడు చీదరిస్తే నేం, మరొకడు మర్యాదయిస్తే నేం, మాస్థాయి మేం ఎరగమా! అయితే ఆ యిద్దరి కుర్రాళ్లతోనే నా అనుభవం ముడిపడి ఉందిగనక ఇంతగా పాతసంగతులు బయట పెట్టవలసి వచ్చింది. రాజు అనే కుర్రాడి కింకా పెళ్ళికాలేదుట, అదాట్టే అవసరం లేదన్న ధీమంతుడు. ఆ తీరు లోనే ఉండేది అతగాడి తిరుగుడు.

ఇక నాకేమాత్రం తీరికదొరికినా శ్రీనివాసరావు తోనే సరిపోయేది. విడిగాళ్ళమని మాకు ముగ్గురికీ ఓ రూమ్ ఎలాట్ చెయ్యడం కాదుగాని శీను సొదతో నా చెవులు హోరెత్తిపోయేవి.

శీనుకి ఆరు నెలలై రాధ అనే అమ్మాయితో పెళ్లయిందిట. అసలు ఈ హనీమూన్ ట్రిప్‌లో వాళ్ల జంటా ఉండి ఉండేదట. ఆఖరి క్షణంలో రాధ డ్రాపయిపోయిందట. వాళ్ళ నాన్నకి హార్ట్ ఎటాక్ వచ్చిందని తెలిసి ఉండి పోవలసి వచ్చిందట.

'ఏమిటో అంకుల్, నేనొక్కణ్ణే యిలా బయల్దేరి రాక పోవలసింది. అనవసరంగా కంగారు పడి ఉండి పోయిందిగాని అదేమంత ప్రమాదకరమైన స్ట్రోకు కాదట. ఫ్లైటు దొరకడాన్ని బట్టి కౌలాలాంపూర్‌లో గాని సింగపూర్‌లో గాని నన్ను కలుస్తానంది. ఆ అదృష్టమైనా ఉందో లేదో! పట్టయ్యా బీచి ప్రకృతి అందాలు అయిపోయాయి కదా! కొరల్ ఐలెండులోని వాటర్ స్పోర్ట్సులో కపుల్స్




కోసం ఓ పోటీ నిర్వహించారు. మేమందులో పాల్గొనలేకపోయాం కదా! మీ కళ్ళల్లోని ఆప్యాయత నన్నింకా యింకా చెప్పుకోమని ప్రోత్సహిస్తోంది. ఏదైనా, సగం సగం పంచుకొనేటంత దగ్గర వాళ్ళం మేము!'

'ఒకర్ని ఒకరు శక్తి కొద్దీ దిగమింగడం తప్ప సంసారంలో సగం సగం ఎక్కడుంటుందిరా వెర్రి మొగం!'

అని నేననుకుంటున్నానని తెలిసే అవకాశం వాడికిలేదు. వాడి ధోరణికి అడ్డుకట్టవేసే ఛాన్సు నాకివ్వకుండా ఎంతో ఉద్రేకంతో ఉత్సాహంతో అదే చెప్పుకుపోవడం! 'నా వేదన వినే పెద్ద మనసున్న వారు, మిమ్మల్ని విసిగించడం లేదనుకుంటాను. ఏదైనా సరిసమానంగా పంచుకొనే అపురూప దాంపత్యం మాది. బ్రెడ్ స్లైసెస్ అయినా లెక్కపెట్టుకుని చెరోసగం తీసుకోవలసిందే. ఏ పండయినా హెచ్చుతగ్గులు కాకుండా సరిగ్గా రెండు ముక్కలు చేసుకోవలసిందే. ఆఖరికి నోట్లో వేసుకునే స్ట్రాంగ్ బిళ్ళయినా సగానికి సగం చప్పరించి అవతలి నోటికి అందించవలసిందే!

అలా వాడు చెప్పుకుపోతూంటే వినీవిననట్టు చూస్తూ తలకిందకి దించుకుని కండువా చివరతో మొహం తుడుచుకున్నాను. ఆస్తి చేజిక్కాక వేషభాషల్లో కూడా కొంత మార్పు తెస్తే లాభసాటిగా ఉంటుందని సమాజాన్ని చూసి నేర్చుకున్నాను. అప్పట్నుంచీ ఇదిగో ఇలా పంచె, లాల్చీ, విధిగా కండువా. కోడెవయసు కోర్కెలు లోలోపల జ్వలిస్తున్నా పైపైకి ఉన్న వయసుకంటె ఎక్కువ ఉన్నట్టు భ్రమకలిగిస్తే ఎవరైనా చెయ్యి అందిస్తారు. అప్పుడప్పుడు ఆడ చెయ్యి కూడా అయి ఉంటే అదో అదనపు సౌకర్యం. అందుకే తలకు రంగువేసే పిచ్చిపని పెట్టుకోలేదు. దాని అవసరం లేక పోయినా కర్రపట్టుకు తిరుగుతాను.

ఇంకా సీనియర్ సిటిజన్ని కాకపోయినా ఆ కన్సెషన్ పొందుతూ ఏడాదై రైలు ప్రయాణాలు చేస్తున్నాను. పెద్ద మనిషి వేషంలో సుఖమెంతుందో అనుభవించిన జ్ఞానులకి గాని అర్థం కాదుకదా!

'వయసు పైబడినా కుర్రాళ్లతో కుర్రాడిలా మీరు మాతో కలిసిపోతున్నారు. మా నాన్న దగ్గర ఇలాంటి పెర్సనల్ విషయాలు బయటపెట్టలేను కదా! ఇంతకీ రేపు రాత్రికైనా రాధ నన్ను కలిసే అదృష్టం ఉంటుందో ఉండదో!'

అయితే ఆ రాత్రికే సగం సగం అని వాడు చెప్పుకుంటున్న వారి దాంపత్య శోభ బలం ఏపాటిదో రుజువు చేసే సంఘటన ఒకటి జరుగుతుందని ఆ క్షణం నేననుకోలేదు!

అది మేం థాయ్‌లెండ్ చేరిన రెండో రోజు. మర్నాటి తెల్లారు ఝామునే అక్కణ్ణుంచి మకాం ఎత్తేసే ఏర్పాటు. చెప్పేను కదా జంటలు మాతో కలవరనే ఆ రాజుగాడు ఎప్పుడు మా రూంకి వస్తాడో మాకే తెలీదనీ. ఇక స్ట్రేంజ్ బెడ్ ఫెలోస్‌లా నేనూ శీనూ మిగిలాం. నేను కర్రపోటు వేసుకుని ఆయాసం నటిస్తూంటే, శీన్ నా బ్యాగు మోసేవాడు.

ఆ రాత్రి బుద్ధాటెంపుల్ చూసివచ్చి డిన్నరు పూర్తిచేసి రూం చేరే సరికి ఏ పదకొండయిందో.

'కొంత వయసు దాటాక నిద్రయినా సరిగా పట్టి చావదుకద. చూడమ్మా శీను ఆ బల్లమీది చిన్న డబ్బాలో నిద్రమాత్రలుంటాయి. కూడా తెచ్చుకుంటాను, ఎందుకైనా మంచిదని. ఆ డబ్బాకాస్త ఇలా యిస్తావూ!' అన్నాను.

శీను ఆ డబ్బా నాకు అందించాడు. అందుకున్నాను గాని ఎప్పుడో అవసరం వస్తే తప్ప వేసుకోను. బాగా పవర్‌ఫుల్ మాత్రలవి. ఓ అరగంట గడిచాక చూద్దాం అనుకుని రగ్గు ముసుగెట్టుకుని ఇటు తిరిగి పడుకున్నా. టెంపుల్ మెట్లెక్కి వచ్చిన అలసటతో ఏమో ఓ పట్టాన నిద్ర పట్టలేదు. చేతనున్న రేడియమ్ వాచీ ముళ్లు పన్నెండున్నర అయిందని సూచిస్తున్నాయి. ఇక లాభం లేదని దగ్గిరపెట్టుకున్న డబ్బా వైపు చెయ్యి జాపబోతే రాజు వచ్చిన అలికిడైంది. ఆ స్టార్ హోటల్ల గదులకి తాళాల బదులు ఎలక్ట్రానిక్ లోహపు రేకుల్లాంటివి మా ముగ్గురికీ మూడు ఇచ్చారు. తలుపు దగ్గిర స్లిట్‌లో ఆమరిస్తే తలుపు తెరుచుకుంటుంది. వస్తూనే రాజు తెచ్చిన భోగట్టాతో మరి నిద్ర అవసరం లేదనిపించింది. చాచిన చెయ్యి వెనక్కి తీసుకుని గాఢ నిద్ర నటించాను.


రాజు సుఖాన్వేషి, కార్యవాది. ఒకప్పటి క్లాస్ మేట్ అయిన శీను తోనే ఆట్టే మాటాడ్డు. అలాంటిది నిద్రలోకి జోగుతున్న శీనుని లేపికూచోబెట్టి చేసిన బోధ వింటూంటే అంత చలిలోనూ నాకే వేడెక్కింది.

రాజు ఆ చుట్టు పక్కలగల ఓ మసాజు సెంటర్లో మాజా అనుభవించి వచ్చాడట. పేరుకి మసాజు అయినా అక్కడ రివాజుగా జరిగేదేమిటో అందరికీ తెలుసు. అంతకు ముందే అసంఖ్యాక శృంగారానుభూతులు చవి చూసిన రాజుకే ఆ హాయి స్థాయి చూశాక 'మర్రోజు మరెందుకు?' అనిపించిందట. ఇంకా ఇలా చెప్పేడు.

'మనలాంటి యువకులం ఇంతదూరం ఎందుకొస్తాం బోలెడు డబ్బు ఖర్చు పెట్టుకుని, రంగు రంగు చిలకలు మన ప్రాంతంలో లేవనే! వీళ్ళ టెక్నిక్ ఓసారి రుచిచూస్తే, మగపుట్టక పుట్టాలే గాని, ప్రతి ఏడాదీ ఇలా పరిగెత్తుకు రానూ! మన వైపు సెక్సు అనేది ఆయా దేహ ప్రాంతాలకే పరిమితం. ఇక ఇది? శరీరమంతా పరుచుకొని ఉన్న చర్మంలోని అణువణువూ అన్య శరీర స్పర్శతో మమైకం పొందే మధురానుభూతి! మన భాష కాదు, మనకి తెలిసిన మొహం కాదు, మళ్ళీ మనం జన్మలో కలుసుకుంటామనే గ్యారంటీలేదు. అయితేనేం? ఆ కాస్సేపయినా శరీర భ్రాంతి పోగొట్టి కాంతిమయం చేసే ఆ నులివెచ్చదనం ఎవరిస్తేనేం, ఎంత వెచ్చిస్తేనేం?'

పోటెత్తిన పొటెన్షియల్ ఉందిగాని ఆ రాజుగాడికి ఇంత ఎక్స్‌ప్రెసివ్ టాలెంట్ ఉందని నేనెప్పుడూ అనుకోలేదు. పైగా నామీద చురకలు కూడా వేశాడు దొంగగాడిద!

'ఎంత సేపూ ఆ ముసిలాడితో గుసగుసలు తప్ప నీకేం వేరే పనున్నట్టులేదు. అన్నీ ఉడిగిన ఆ ధోవతీ గాడితోనా నీ దోస్తీ! ఎప్పటికప్పుడు రెన్యూ చేసుకోకపోతే మగతనం మగతలోకి జారిపోగలదు జాగ్రత్త! ఆ వృద్ధ జంబుకంలా గాడితప్పిన మగాడివి కాదు గనక నీకో సలహా. ఇదిగో ఆ మాసేజింగ్ సెంటరు కార్డు. వెంటనే ఫోన్ చేసి ఎపాయింట్‌మెంటు వెంటనే ఫిక్సు చేసుకో. వాళ్లు



రాత్రి తెల్లవార్లూ ఉంటారు. నీ నంగనాచి మొహం చూస్తే ఇలాంటి వాటికి మొహంవాచి ఉన్నావని స్పష్టంగా తెలుస్తోంది. జెట్ స్పీడుగ రంగంలోకి దిగక నీకేం జబ్బా! నీతులన్నీ నిలువెత్తుగోతుల్లో కప్పెట్టడానికే కదా పుట్టింది! ఇక ఆలోచించకు. నాకు నిద్దరొస్తోంది. బెస్ట్ ఆఫ్ సెక్స్ పీరియన్స్!' అంటూ సైడ్ వింగ్‌లోకి జారబడి పక్కెక్కేశాడు రాజు. అయిదు నిమిషాలు దాటకుండా గుర్రెట్టి నిద్రపోయాడు.

నేనా ముసుగులోంచి శీను కదలికలు గమనిస్తూనే ఉన్నాను. ఉషారుగా ఉన్నప్పుడు ఈల వేస్తూ పనులు చేసుకోడం అతనికలవాటు. దాన్ని బట్టి కూడా అతని మూమెంట్సు అక్కణ్ణుంచే ఫాలో అవడం నాకు సుళవయింది.

శీను వేణ్ణీళ్ల టబ్ స్నానం ముగించాడు. ఒళ్లంతా ఫారిన్ టాల్కం, సెంటెడ్ స్ప్రే కొట్టుకున్నాడు. తెల్లాటి ఇస్త్రీ మడతల్లోకి మారిపోయాడు. పైజామా జేబు నిండా విదేశీ నోట్ల కట్టలు కుక్కుకున్నాడు. టెలిఫోను క్రెడిలు ఎత్తబోయాడు. నేను సమయానికక్కడ చేరి ఆ చెయ్యి పట్టుకున్నాను. ఊహించని ఈ పరిణామానికి అతను త్రుళ్లిపడ్డాడు.

'మీరు నిద్రపోలేదా సార్?' అన్నాడు వణుకుతూ. బాల్కనీలో లైటువేసి అక్కడికతన్ని లీడ్ చూశాను. ఆ పెద్ద బల్లకి అటూ ఇటూ కుర్చీల్లో కూచున్నాక నేను మొదలెట్టేను.

'నిద్రపట్టలేదయ్యా.. శీను! మీ ఫ్రెండు చేసిన హడావిడితో ఎక్కడ నిద్ర అక్కడ ఎగిరి పోయిందనుకో'

'అంటే, మీరు?'

'రాజు నీతో చెప్పిన మసాజు విషయం ప్రతీ ముక్కా నా చెవిన పడింది. దాని మీద నా అభిప్రాయం చెబుదామనే పిలిచాను. మసాజు చేయించుకోడానికే కదా నీవూ ముస్తాబు? ఫీజెంతో కనుక్కున్నావా, నీ దగ్గిరున్నది చాలక పోతే ఆత్మీయుణ్ణి నేనున్నాను సుమా! ఆ కారణం చేత విత్‌డ్రా అవుతావేమోనని డిస్టర్బ్ చేశాను. సారీ. ఇదిగో ఈ సొమ్ముకూడా తీసుకో'

పట్టు బడిన కన్నపు దొంగలా అతను మొహం దించేశాడు. చెయ్యిపట్టుకు చూస్తే అంత చల్లని వేళా అతని అరచేతిలో చిరు చెమటలు!

'నా పెద్దరికం మీద నీకేమాత్రం గౌరవమున్నా ఒక్క విషయం ఆలోచించు. చెప్పనా?'

'ఏముంది, మసాజ్ సెంటర్‌కి వెళ్లొద్దంటారు, అంతేకదా!'

'అదేం కాదు, వెళ్లమనే కదా చాలకపోతే డబ్బిస్తానని చెప్పేను! అయితే దాన్తో పాటు మరొకటీ నువ్వు చెయ్యాల్సి ఉంది. చేస్తానని మాట యివ్వు'

'ఇంతటి సిగ్గుచేటు పనికి తలపెట్టాక, ఇప్పుడు మీరు వెళ్ళమంటే మాత్రం, వెడతానని ఎలామాటయిస్తాను?'

'అదికాదు. నే చెప్పింది పూర్తిగా విను. రాధ అనే అమ్మాయి ఎవరో, అదే మీ ఆవిడ, మహా అదృష్టవంతురాలు. మీరిద్దరూ ఎంతగానో ప్రేమించుకుని ఉండక పోతే ఇంతగా మీ అనురాగ శోభ పరాయి వ్యక్తికి, అందునా ఓ వయసు కాని వాడికి, చెప్పుకుని తరించి ఉండవు. ఏ అనుభవమైనా మేమిద్దరం చెరిసగం పంచుకుంటామని నువ్వు చెప్పిన ఆ తీయని భావన. ఏ జంటకయినా ఆదర్శ ప్రాయం. అందుకనే, ఆ భావన చెడకుండా ఉండేందుకు నేనో సలహా ఇవ్వదల్చుకున్నాను. మరెలాంటి ఫోన్ చేసి ఎంత ఆఘమేఘాల మీద రప్పిస్తావో, మీ రాధని వెంటనే యిక్కడికి రప్పించు. ఇంత గొప్ప మసాజు మాధుర్యాన్ని నువ్వొక్కడివే అనుభవించే స్వార్థం నీకు ఉందనుకోను. మసాజు సుఖం అందించే మహరాణులు మగవారికి ఎలా ఉంటారో ఆడవాళ్ళకి కూడా అలాంటి సుఖం ప్రసాదించే మగధీరులు ఉండకపోరు. వాకబు చేసి, మన జేబు మనది కాదనుకొంటే, ఆ సెంటర్లోనే దొరుకుతారు. నిజంగా నీ అర్ధాంగితో అన్నీ పంచుకొనే వాడివే అయితే కట్టుకున్నదానికి కూడా అలాంటి సుఖం అందించడం ఆదర్శ భర్తగా నీ బాధ్యత'

'సారీ అంకుల్' అన్నాడు శీను హీన స్వరంతో, బట్టలు మార్చుకుంటూ.

'చూడు శీను, ఈ నీతి బోధ కేవలం యాక్సిడెంటల్. నేనుంటాను, ఉండకపోతాను, నిన్ను నువ్వు కంట్రోలు చేసుకోవాలి. కట్టుకున్న ఆడదానితో కట్టి ముడేసు కోవలసింది మనసు. మరేం కాదు. నీ ఆలోచనని అల్లకల్లోలం చేసి పారేసినట్టున్నాను. ఇక నీకు నిద్ర పట్టడం కష్టం. ఇదిగో నా దగ్గరున్నాయి రెండు వేసేసుకో. మరేం ప్రమాదం లేదు. నేనూ వేసుకుంటాను' అంటూ మంచి నీళ్లిచ్చి మాత్రలు మింగించాను. ఓ అరగంటలో శీనూ నిద్రలోకి జారుకున్నాడు.

నన్నో ముసలి ముతకగా జమకట్టినందుకు వీళ్లకిలా మిగలవలసింది పడుచుగురకలే! వీళ్ల మేలుకుని ఉన్నా తెగించడానికి నాకైతే అభ్యంతరం లేదు కాని నా పెద్దమనిషి బురఖా ఏంగానూ!

ఇక నిద్రపోవలసిన అవసరం నాకేముంది! వెంటనే మసాజ్ సెంటర్‌కి లైట్నింగ్ కాల్ బుక్ చేశాను. తక్షణం ఎపాయింట్‌మెంట్ బుక్ చెయ్యమని, ఎంతైనా ఫరవాలేదని!

★


అవసరాల రామకృష్ణారావు

98662 21575




# అతిపెద్ద గుమ్మడికాయ

మామూలుగా అయితే గుమ్మడికాయ బరువు ఐదు నుంచి పది కిలోలు ఉంటుంది. అక్కడికే అది పెద్ద సైజు అనుకోవచ్చు. కానీ వెయ్యి పౌండ్ల గుమ్మడికాయ ఉందంటే ఆశ్చర్యపోక తప్పదు. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద గుమ్మడికాయగా గుర్తింపు కూడా పొందింది. న్యూయార్క్‌లో ఇటీవల జరిగిన గుమ్మడికాయల ప్రదర్శనలో మైక్ మాట్లో పండించిన గుమ్మడికాయ అతిపెద్దదిగా గుర్తింపు పొందింది. ఈ గుమ్మడికాయ బరువు 1,040.5 పౌండ్లు. న్యూయార్క్‌లో అధిక వర్షాలతో పంటలకు ప్రతికూల పరిస్థితులు ఉన్నా మైక్ ఇంత పెద్ద గుమ్మడికాయను సాగు చేసినందుకు నిర్వాహకులు అతనిని అభినందించారు. ఈ సందర్భంగా మైక్ మాట్లాడుతూ, గుమ్మడి సాగుకు పెద్దగా నీరు అవసరం లేదని, కొద్దిగా వేడి, ఎండ ఉంటే సరిపోతుందని అన్నాడు. ఈ సంవత్సరం ఎక్కువగా వర్షాలు పడడంతో వాతావరణంలో కావలసినంత ఉష్ణోగ్రత లోపించిందని చెప్పాడు. పరిస్థితులు అనుకూలించి ఉంటే, మరింత పెద్ద గుమ్మడికాయను సాగుచేసే వీలు ఉండేదని అన్నాడు.